# ఇది కథ కాదు

మామిడితోటకీ కాలవగట్టుకీ మధ్య బాడ్మిం టన్ కోర్టు చూస్తే భలే సరదా వేసింది మూర్తికి.

"మామిడి పళ్ళుతింటూ, బాడ్మింటన్ ఆడు కుంటూ, కాలవలో ఈతలు కొడుతూ ఎన్నాళ్ళయినా వుండిపోవచ్చురా కృష్ణా మీ ఊళ్ళో!" అన్నాడు నవ్వుతూ రామకృష్ణతో.

ప్రతీ వేసంకాలం మామిడి పళ్ళకోసం నాలుగు రోజులైనా మేనత్తగారి వూరు రావటం మూర్తికి చాలా సరదా.

రామకృష్ణా మూర్తీ చిన్నప్పుడు 'బావా, బావా' అని పిల్చుకునే వాళ్ళు, పెద్దవాళ్ళు చెప్పినట్టు. హైస్కూల్లో అలా పిల్చుకుంటూంటే ఎవరో నవ్వారని ఇద్దరూ అది మానేశారు. స్కూలుఫైనల్ పాసై, కాలేజీలో కూడా కలిసే చేరారు, ఇద్దరూ.

హఠాత్తుగా తండ్రి పోవటంతో రామ కృష్ణ చదు వుకి స్వస్తి చెప్పి పొలం వ్యవహారాలు చూసుకోక తప్ప లేదు.

ఆ ఊరు మూర్తికి వేసవి విడిది.

మూర్తి మాటలకు రామకృష్ణ చాలా ఊరిస్తూ చెప్పాడు. "ఐదారు నెలలనుంచీ ఆడుతున్నాం. ఫుల్ టీమ్ వుంది తెలుసా? కొంతమంది ఇప్పుడు వూళ్ళో లేరుగానీ చూస్తే నువ్వు భలే సర్దా పడతావు" అన్నాడు బాడ్మింటన్ కోర్టులో నెట్ కడుతూ.

మూర్తి బాడ్మింటన్ చాలా బాగా ఆడతాడు. కాలేజీ గేమ్సులో ఎప్పుడూ సెంటర్ ఆడుతూంటాడు.

రామకృష్ణ కబురంపితే ఇంకో ఇద్దరు వచ్చారు. నలుగురూ ఆడటం మొదలుపెట్టారు. చూస్తోండగానే మూర్తి జట్టుకి పదిపాయింట్లు వచ్చాయి.

"మా వాడు మామిడిపళ్ళు మేసి తెగ గంతు లేస్తున్నాడు" అన్నాడు కసిగా రామ కృష్ణ.

"ఏడిశావులే. ఎత్తు ముందు" అంటూ మూర్తి బంతిని విసిరికొట్టాడు.

దాన్ని రామకృష్ణ చాకచక్యంగా తిప్పికొట్టాడు. ఫ్రంట్‌ని తప్పించుకు వచ్చిన బంతిని వెనక ఆడుతోన్న మూర్తికూడా వదిలేశాడు, కాలవగట్టు వేపు ఆశ్చర్యంగా చూస్తూ.

ఒక ఆడమనిషిని వెనకాల కూర్చోబెట్టు కొని ఒక మొగతను సైకిలు తొక్కుకుంటూ వస్తున్నాడు. అలాంటి దృశ్యం కొత్తేంకాదు మూర్తికి. కానీ .... ఇక్కడ .... ఈ పల్లెటూళ్ళో .... ఇంత పబ్లిగ్గా .... "ఏం దృశ్యంరా! చూడ ముచ్చటగా వుంది" అనేశాడు అప్రయత్నంగా.

కోర్టు పక్కనించే సైకిలు ముందుకు వెళ్ళి పోయింది. మూర్తి ఇద్దర్నీ బాగా చూశాడు. మొగవాడు పంచి కట్టుకున్నాడు. చొక్కామీద పైపంచి వేసు కున్నాడు. ఆడ మనిషి ఎర్రచీర కట్టుకుంది. బిర్రుగా జడ వేసుకుంది. మొగతనికి ముప్పై .... ఆడ మనిషికి పాతిక దాటివుంటాయి.

మూర్తి చూసిచూసి వెనక్కి తిరిగివస్తూ "ఈ పల్లె టూరి పక్షులకి సైకిల్ యాత్రేవిటిరా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"ఏడిశావ్‌లే, వాళ్ళు వింటే?"

"ఏం, వింటే? నేనేం తిట్టలేదు వాళ్ళని. మీ ఊరు మెడ్రాస్‌లా అయిపోయిందే!"

"ఒరేయ్! వాళ్ళేం కొవ్వెక్కి షికార్లు చెయ్యటం లేదు!"

రామకృష్ణతో పాటు మిగతా ఇద్దరూ కూడా అసలు విషయం చెప్పు కొచ్చారు మూర్తికి.

ఆ సైకిల్ తొక్కే అతని పేరు చంద్రన్న. వడ్రంగం పని చేస్తాడు. ఊళ్ళో రైతులందరికీ నాగళ్ళ దగ్గర్నుంచీ ఆడవాళ్ళకి అప్పడాల కర్రల వరకూ చేసి ఇస్తూం టాడు. సైకిల్ వెనకాల కూర్చున్నామె చంద్రన్న భార్య.

పేరు కాంతమ్మ. అవిడికి ఆర్నెల్ల కిందట ఏదో జబ్బు చేసి కాళ్ళు పడిపోయాయి. అప్పట్నించీ నడవటం లేదు. మంచంమీదే అన్నీ. జబ్బు ముమ్మరంగా వున్నప్పుడు నాలుగైదుసార్లు పొరుగూరు నించి డాక్టర్ని ఇంటికి తీసుకొచ్చాడు చంద్రన్న. అప్పటికే చాలా ఖర్చయింది. కాంతమ్మకి రోజూ ఇంజక్షన్ ఇవ్వాలి.

ఊళ్ళో వున్న మాత్రల పుల్లయ్య తప్ప తాగి ఇంజక్షన్లిస్తూంటాడు. వాడితో ఇంజక్షన్ చేయించుకున్న వాళ్ళు ఒక నెల్లాళ్ళ తర్వాత ఆ చేతికి తప్పకుండా ఆపరేషన్ చేయించుకోవాలి. అందుచేత చాలామంది పొరుగూరే పోతూ వుంటారు.

కాంతమ్మ జబ్బుపడ్డ దగ్గిర్నించీ చంద్రన్న ఇంటి పనులుకూడా తనే చూసుకుంటున్నాడు. పదేళ్ళ కొడుకూ ఏడేళ్ళ కూతురూ వున్నారు. వాళ్ళిద్దరూ బడికి పోతారు.

ఇంజక్షన్‌కోసం పొరుగూరు డాక్టర్ దగ్గిరికి వెళ్ళాలంటే అద్దె బండి కట్టించుకోవాలి. చంద్రన్నలాంటి వాళ్ళకి అది సాధ్యంకాదు. అద్దె సైకిల్ అయితే గంటకి పావలాతో అయిపోతుంది. గంటలో వెళ్ళి వచ్చేస్తాడు.

రెండు నెలల్నించీ అలా తీసికెళ్తున్నాడు. మొదట్లో రెండు మూడు రోజులు అందరూ నవ్వుకున్నారు. చంద్రన్న ఎవరి నవ్వులూ పట్టించుకోలేదు. పెళ్ళాన్ని రోజూ తీసికెళ్ళి ఇంజక్షన్లు చేయించుకొస్తూనే వున్నాడు.

అంతా చెప్పి "చూశావా? అసలు సంగ తేవిటో తెలీకుండా 'ఏం దృశ్యంరా' అని కూశావ్" అన్నాడు రామకృష్ణ కోపంగా.

నిజంగా మూర్తి నొచ్చుకున్నాడు — "ఛ! లేదురా! నాకు తెలీదురా! ఏదో అనుకున్నారా! సరదాకి అన్నారా!" అని సంజాయిషీ చెప్పుకున్నాడు.

"సర్లే! సర్లే! ఈసారేం వాగకు, ఆడు" అంటూ రామకృష్ణ కోర్టులోకెళ్ళి నించున్నాడు.

చీకటిపడేవరకూ ఆడుతూనే వున్నారు. చంద్రన్న సైకిల్ తిరిగి వస్తోంటే ఫ్రంట్ వెంక ట్రావు చెప్పాడు మూర్తికి. మూర్తి నిలబడి చూశాడు వెళ్ళిపోతూన్న సైకిల్ని.

డాక్టర్ దగ్గిరికి వెళ్ళి వస్తున్నారు.

చీకట్లో ఇద్దరూ ఆనవాలు తెలీలేదు. ఎర్రచీర నల్లచీరలా కనబడింది. ఈసారి వాళ్ళని చూస్తే చాలా జాలేసింది! చాలా ఆశ్చర్యం వేసింది.

రెండో రోజుకూడా చంద్రన్న కాంతమ్మని తీసు కెళ్ళటం. తీసుకురావటం, చూశాడు మూర్తి.

సైకిల్ వెళ్ళిపోయాక కృష్ణతో అన్నాడు "అతను ఎంత మంచివాడురా!"

"ఎవరు?"

"అతనే, చంద్రన్న."

"ఏం, ఎందుకూ?"

"ఎందుకేమిటి? అతను ఎందుకు మంచివాడో చెప్పాలా?"

వారంరోజుల్నించీ రోజూ చంద్రన్ననీ కాంతమ్మనీ చూస్తూనే వున్నాడు మూర్తి. ఇద్దరూ బాగా పరిచయస్తుల్లా కన్పిస్తారు. దూరం నించే. చంద్రన్న బట్ట లెప్పుడూ మాసినట్టే వుంటాయి. ఒక్కోరోజు భుజం మీద తుండుగుడ్డ వుంటుంది. ఒక్కోరోజు వుండదు. కాంతమ్మ ఎర్రచీరో నల్లచీరో తప్పితే ఇంకో రంగు చీర కట్టడం చూడ లేదు. జడ బిగించి వేసుకుంటుంది. కళ్ళనిండా కాటుకా బొట్టూ కొట్టొచ్చినట్టు కనపడతాయి. మొహం కళగా వుంటుంది. తెల్లగా వుంటే ఇంకా అందంగా వుండేదేమో! సైకిలు, కోర్టుకి దగ్గరగా వచ్చేసరికి కాంతమ్మ మొహం అటు తిప్పేసుకుని కూర్చుంటుంది.

వెళ్ళేటప్పటి కంటే, వచ్చేటప్పుడు వాళ్ళిద్దరూ ఇంటికి హుషారుగా వెళ్ళిపోతున్నట్టు తోస్తుంది మూర్తికి. మూర్తి అప్రయత్నంగా "చంద్రన్న చాలా మంచివాడు!" అనేస్తాడు. అలా అనకపోతే ఏదో బరువుగా వుంటుంది గుండెల్లో. ఆ మాట తప్పకుండా అంటాడు.

"రోజూ మమ్మల్నేం కాల్చుకు తింటావురా? ఒకసారి చంద్రన్నతో చెప్పు, సంతోషిస్తాడు" అన్నాడు రామకృష్ణ విసుగ్గా. ఆ సైకిల్ని చూస్తూ మూర్తి ఆట ఇంటరెస్టింగ్‌గా ఆడటంలేదని కృష్ణ చిరాకు.

ఒకనాడు మిట్టమధ్యాహ్నం వరకూ ఫెళ్ళున ఎండ కాసి హఠాత్తుగా జోరున వాన కురవటం మొదలు

పెట్టింది. సాయంత్రం నాలుగ్గంటల వరకూ ఎడతెరిపి లేకుండా కురిసి వెలిసింది. మళ్ళీ భళ్ళున ఎండ వచ్చింది. ఒక సంవత్సరంనించీ వానలు కురవనంత నిర్మలంగా అయిపోయింది ఆకాశం.

బాడ్మింటన్‌కోర్టు అంతా బురదగా అయిపోయిం దని ఆ రోజుకి ఆట విరమించి మామిడితోటలో షికారుకి పోయారు, మూర్తీ రామకృష్ణా. మామిడాకు ల్లోంచి నీటి చుక్కలు జలజలా ముత్యాల్లా రాలిపడు తుంటే తడిసినా మెత్తపడని ఎండుటాకుల మీద నడుస్తూ తోటంతా తిరిగి తిరిగి ఒక కొమ్మమీద కూర్చున్నారు ఇద్దరూ.

హఠాత్తుగా గుర్తువచ్చి కాలవగట్టుకేసి చూశాడు మూర్తి. కాంతమ్మ ఒక్కతే సైకిల్ మీద కూర్చుని వుంది. చంద్రన్న సైకిల్‌ని పట్టుకుని నడుస్తున్నాడు బురదలో. బురదకి జడిసి కాలవ గట్టుదారి వదిలేసి మామిడి తోట పక్కనించి సైకిల్ నడిపించుకుని వెళ్తున్నాడు.

"అతనితో ఏదన్నా మాట్లాడరా కృష్ణా" కుతూహ లంగా అన్నాడు మూర్తి.

"ఏం మాట్లాడమంటావ్?"

"ఏదో ఒకటి. నీకు తెల్సినవాడేగా? ఆవిడ కెలా వుందో అడుగు."

"బాగా వుందిరా నీ గోల ...." అని కంఠం కాస్త పెద్దది చేసి — "ఇంకా ఎన్నాళ్ళు వెళ్ళాలి చంద్రన్నా?" అన్నాడు రామకృష్ణ చంద్రన్నకి వినపడేలా.

చంద్రన్న మొహంతిప్పి తోటలో కృష్ణని చూసి నవ్వు మొహంతో "ఇంకా ఐదారు వారాల్దాకా వెళ్ళా లబ్బాయిగారూ!" అన్నాడు.

"ఏమైనా నయమేనా? గుణం కనపడుతోందా?"

"అఁ, బాగా గుణం వుందండీ! ఇప్పుడు కొంచెం నడవగల్దు."

"ఇవాళ బురద బురదగా వుందిగదా? మానె య్యక పోయావా? ఒక్కరోజుకేంపోతుంది?"

"ఫర్వాలేదులెండి బాబూ! మానేస్తే ఎలాగ? ఎళ్తా నండీ" అంటూ ముందుకు సాగిపోయాడు.

"నిజంగా ఇంత మంచిమనిషిని నేనెప్పుడూ చూళ్ళేదురా!" అన్నాడు మూర్తి.

కృష్ణ నవ్వి "నువ్వే చంద్రన్న స్థితిలో వుంటే ఏం చేస్తావురా? పెళ్ళానికి వైద్యం చేయించకుండా పుచ్చ బెట్టుకుంటావా? కాస్త బుద్ధీ జ్ఞానం వున్నవాడు కాబట్టి కష్టమో నిష్ఠూరమో భరిస్తున్నాడు."

"అవుననుకో .... అయినా ఏమో ...." అంటూ నసిగాడు మూర్తి.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ చాలా సేపు కూర్చు న్నారు.

ఎండ తగ్గుతోంటే లేచి ఊళ్ళోకి బయల్దేరారు. పశువులన్నీ వీధులు బురద బురద చేసుకుంటూ ఇళ్ళకి వస్తున్నాయి. మొగ వాళ్ళు కావిళ్ళతో నీళ్ళు తెచ్చుకుంటున్నారు. పిల్లలు తపతపా నీళ్ళల్లో నడుస్తూ పడుతూ లేస్తూ ఆడుకుంటున్నారు. బురద వాసనా గడ్డివాసనా, పేడవాసనా అన్నీ కలగలుపుగా గుభాళిస్తు న్నాయి.

మూర్తి హాయిగా గాలి పీల్చుకుంటూ "మీ ఊరు ఎంత సొగసుగా వుందిరా!" అన్నాడు నవ్వుతూ.

మూర్తికి పల్లెటూళ్ళంటే చాలా ఇష్టం. పొద్దు వాలి పోయే వేళల్లో ఈ వీధుల్లో తిరుగుతూ చిన్నప్పటి రోజు లన్నీ గుర్తుచేసుకుంటే ఎంతో కమ్మగా వుంటాయి.

నడుస్తోన్నవాడల్లా ఆగిపోయాడు మూర్తి. "అదేనా చంద్రన్నా వాళ్ళ ఇల్లు?" అటు చూస్తూ అడిగాడు.

"అమ్మ వచ్చేసింది అన్నయ్యా!" అని సంతోషంగా అరుస్తోంది ఆడపిల్ల గుమ్మంలో నించుని.

చంద్రన్న రోడ్డుమీద సైకిల్ నించో బెట్టాడు. గుమ్మం దగ్గిరికి వెళ్ళటానికి దారి బురదమయంగా వుంది. చంటిబిడ్డని పొత్తిళ్ళలో ఎత్తుకున్నట్టు కాంత మ్మని రెండు చేతుల మధ్యా ఎత్తుకున్నాడు. రెండు అంగలువేసి ఇంట్లోకి వెళ్ళిపోయాడు. రెండు నిమి షాల్లో బయటికొచ్చాడు.

రోడ్డుమీద నిలబడ్డ రామకృష్ణని చూస్తూ — "రండి అబ్బాయిగారూ! నిలబడ్డారేం? లోపలికి రండి" అన్నాడు ఆప్యాయంగా.

"అబ్బే! ఎందుకూ? మా మూర్తి రేపు వెళ్ళిపోతాడని కాస్సేపలా తిరిగి వస్తున్నాం. ఫర్వాలేదు. నువ్వు వెళ్ళి సైకిల్ ఇచ్చెయ్యి! మేం వెళ్తాంలే" అన్నాడు

రామకృష్ణ.

మూర్తికి మాత్రం చంద్రన్న ఇంట్లోకి తొంగి చూడాలనే వుంది. ఏమీ అనకుండా రామకృష్ణతోపాటు నడక సాగించాడు.

"వాళ్ళిద్దరూ చాలా ఇష్టంగా వుంటారనుకుంటాను కదూ?"

"ఏమో! ఎవడికి తెలుసు? వాళ్ళింట్లో దూరి చూశామా?"

"అది కాదు, ఊళ్ళోమాట."

"నాకు తెలీదురా! మా అమ్మనడుగు చెప్తుంది"

మూర్తి, ముందు నడుస్తోన్నా, ఊహాలు వెనక్కి పరిగెట్టాయి. చిన్నపిల్ల లైతే, వాళ్ళ గుమ్మంలోకైనా వెళ్ళి తొంగి తొంగి చూడొచ్చు. ఎంత బాగుంటుందో! చంద్రన్న కాంతమ్మని లోపలికి తీసుకుపోయి మంచం మీద పడుకో బెట్టాడేమో! సైకిల్ ఇచ్చేసి ఇంటికి వచ్చి వంట చేస్తాడు. పిల్లలకి తిళ్ళు పెడతాడు. పెళ్ళానికి అన్నం పెట్టితనూ తింటాడు.

నిజంగా కాంతమ్మ, భర్తని చూసుకుని ఎంత పొంగిపోతుందో! "నేను మంచంలోంచి లేవాలిగానీ .... అప్పుడు నీకెంత సేవచేస్తానో చెప్పలేను" అన్నట్టు పొంగి పొర్లుతోన్న కృతజ్ఞతతో చూస్తూ ఉంటుందా? చంద్రన్న నవ్వి — "నువ్వు మంచంలోంచి లేచాక నన్ను పడుకోబెడతావా?" అంటాడేమో హాస్యంగా.

రేపు కాంతమ్మకి బాగుపడిపోయాక, వాళ్ళిద్దరూ ఇంకా అతుక్కుపోయినట్టు అయిపోతారు. కష్టాలు మనుషుల్ని బాగా దగ్గిరగా చేస్తాయి.

"నిజంగా .... కష్టాలే మనుషుల్ని సన్నిహితం చేస్తాయి" అన్నాడు మూర్తి గట్టిగా ఎవరికో చెప్తున్నట్టు. కృష్ణ వినిపించుకో లేదు.

మూర్తి వెళ్ళిపోయాడు. టౌన్‌లో .... కాలేజీ వాతావరణంలో కలిసిపోయాడు.

కాలవ ఒడ్డున .... చంద్రన్నా .... కాంతమ్మా .... సైకిల్‌మీద .... ఆ దృశ్యం ఎప్పుడు గుర్తువచ్చినా .... దాన్నో పవిత్ర స్మృతిలాగ నెమరు వేసుకుంటాడు. దాన్ని జీవితమంతా గుర్తు వుంచుకోగలిగితే ఎంతో మేలు చేస్తుంది ఎవరికైనా. కాంతమ్మ ఎప్పటికి లేచి తిరుగుతుందో! చంద్రన్నని ఎంత ముద్దుగా చూసుకుంటుందో!

మూర్తి, నెమ్మదిగా ఆ ఊరుసంగతులు మరిచిపోయాడు.

రామకృష్ణ అప్పుడో ఉత్తరం, ఇప్పుడో ఉత్తరం రాస్తూనే వున్నాడు మూర్తికి.

ఆర్నెల్లుదాటి వుంటుంది. ఒక కవరు రాశాడు, రామకృష్ణ మూర్తికి.

కుశల ప్రశ్నలు వేశాడు. క్షేమ సమాచారాలు చెప్పాడు. "అసలు ఇందుకే నీకీ ఉత్తరం మొదలు పెట్టాను. నీకో విశేషం రాయాలి. మా ఊళ్ళో కాంతమ్మ గుర్తుందా? చంద్రన్న భార్య .... కాళ్ళు పడ్డాయనీ .... అప్పుడు సైకిల్‌మీద .... మర్చిపోయి వుండవు .... ఆ కాంతమ్మ ఏం చేసిందో తెలుసా? ...."

ఆతృతతో గుండెవేగం హెచ్చింది మూర్తికి ఉత్తరం చదువుతోంటే.

"నిన్ను కాస్సేపు ఊరించాలని ఉందిరా! ఈ కబురు వింటే నీ మొహం ఎలా అవుతుందో చూడాలనిపిస్తోంది. తిట్టు కుంటావేమో! చెప్పెయ్యనా?

వారం పదిరోజులైంది .... కాంతమ్మ .... బైరాగులు టైలర్‌తో వెళ్ళిపోయింది. వెళ్ళిపోయిందిరా! చంద్రన్నని వదిలేసి వెళ్ళిపోయింది!"

ఉత్తరం చదువుతూ అదిరిపడ్డాడు మూర్తి. స్థాణువైపోయాడు. చాలాసేపు ఉత్తరం చదవకుండా అదిరిపాటు స్థితిలో వుండిపోయాడు.

కాస్త తేరుకోగానే రామకృష్ణ ఉత్తరం మీద నమ్మకం పోయింది. వాడేదో తనని వెర్రెత్తించటానికి వాగివుంటాడు.

కాంతమ్మ .... వెళ్ళిపోవటం ఏమిటి! మళ్ళీ ఉత్తరంలోకి చూశాడు — "నువ్వు నమ్ముతావో లేదో! వాళ్ళిద్దరూ దేశాలు తెగించిపోలేదు. పక్క ఊళ్ళోనే కాపరం పెట్టారు. అక్కడ బైరాగులవాడి అప్పగారుందట. ఆ ఇంట్లో ఒక గదిలో వుంటున్నారట, చంద్రన్న తాలూకు వాళ్ళు వెళ్ళి పిల్చుకు రాబోతే రాను పొమ్మం

దట. ప్రస్తుతం వాళ్ళిద్దరూ ఆ ఊళ్ళోనే వున్నారు. పిల్లల్ని చంద్రన్నే చూసుకుంటున్నాడు.

ఇప్పుడేమంటావ్?

అసలు నువ్వెళ్ళిన దగ్గర్నించీ వాళ్ళిద్దరి మీదా నాకూ కుతూహలం పుట్టింది. వాళ్ళ సంసారం గురించి వాకబు చేశాను. దాని గుణం మంచిది కాదని చంద్ర న్నకి చాలా కాలం నించీ తెలుసట. కోపం వస్తే గొడ్డుని బాదినట్టు బాదేవాడట.

తీరా అది జబ్బుపడింది. ఏం చేస్తాడు? పారేసు కుంటాడా? ఇంట్లోపడి మూలుగుతోంటే ఏదో చెయ్యాలి కదా? అలాగే తనకి చేతనైంది చేశాడు.

ఏదో ఘనకార్యం చేసేస్తున్నానని వాడూ అనుకో లేదు. అదీ అనుకోలేదు.

కాంతమ్మకి ఎన్ని జన్మలెత్తినా మొగుడి మీద ప్రేమ పోదన్నావుగా? ఇప్పుడిలా ఎందుకు చేసిందం టావు? వాడు చేసిందంతా దానికి మామ్మూలుగా కన్పించింది. ఎవడికోసం చేస్తాడులే అన్నధోరణితో ఆలోచించిందేమో! నువ్వన్నట్టు మొగుడిమీద ఏమన్నా కృతజ్ఞతవున్నా — నాలుగైదు నెలలకి అది మరుగున పడిపోయింది. వాడు మళ్ళీ కోపం వచ్చి కొట్టిన్నాడు అది పూర్తిగా హరించిపోయింది.

చూశావా మూర్తీ, మనుషులెంత సామాన్యమైన వాళ్ళో? అష్టకష్టాలు పడి దాని కాళ్ళు బాగుచేయించిన వాడు మళ్ళీ దాన్ని చావగొట్టడం ఎందుకు చెప్పు? ఇష్టంలేక పోతే పొమ్మనరాదూ?

తనకోసం — మొగుడు అప్పులపాలై ఇల్లూ ఒళ్ళూ గుల్లచేసుకుని అంత చాకిరీ చేస్తే మళ్ళీ అది తప్పుడు పని చేస్తుందా? 'కృతజ్ఞత' మాట అలా వుంచు, బుద్ధీ జ్ఞానం ఉందా?

బాగా ఆలోచిస్తే మనుషులంతా ఇంతే అని పిస్తోంది. మనం కూడా ఇంతే మూర్తీ!

ప్రేమ — కృతజ్ఞత — అభిమానం —కోపం — ద్వేషం — ఇవన్నీ అప్పటికప్పుడు రేగే అను భూతులే గానీ, పోయిన పొడుగునా వుండవు.

ఒకసారి కోపంవస్తే అదే శాశ్వితంగా వుంటుందా? అలాగే, ఒకసారి కృతజ్ఞత కలిగితే, కొన్నాళ్ళకి అదీ వుండదు. ఒకనాడు బలంగా కలిగిన అనుభూతి క్రమంగా బలహీనమై పోతుంది.

మన అభిప్రాయాలు ఎప్పటికప్పుడు చంచలంగా తిరుగుతూంటాయి.

ఇదే నిజం గాకపోతే కాంతమ్మ అలాంటి ఘోరం చేసి వుండదు. అది మాత్రం మనిషి కాదా?"

ఆ ఉత్తరమంతా ఎప్పటికప్పుడే చీరె య్యాలనుకుంటూనే గబగబా చదివేశాడు మూర్తి.

కాంతమ్మ .... చంద్రన్నని వదిలేసిందా? మనిషి జన్మ ఎత్తి అలాంటి ఘోరం ఎలా చెయ్యగలిగింది?

జీవితంలో అనుభూతులన్నీ అబద్ధమా? ప్రేమ శాశ్వతంగా వుండదూ? కృతజ్ఞత మనిషిని బంధించదూ? అది ఒకప్పుడు వుండి, ఒకప్పుడు పోతుందా?

మన అభిప్రాయాలు స్థిరంగా వుండవూ? మంచి చెడ్డల తారతమ్యాల్ని మనిషి అర్థం చేసుకోలేడూ? ఎంత అబద్ధం! మనిషిని ఇంత దారుణంగా నిర్వచించే వాళ్ళ నేమనాలీ?

మూర్తి, రామకృష్ణకి వెంటనే జవాబు రాశాడు — "చంద్రన్న దేవుడు! కాంతమ్మ రాక్షసి! వాళ్ళ లక్షణాలు గుర్తించిన నేను మనిషిని!

ఇద్దరికీ ఒకటే విలువ కట్టిన నువ్వు .... పశువ్వి .... పశువ్వి!

కృష్ణా! నువ్వు నిజంగా పశువ్వి!"

[1967 ఆగస్టు 'యువజ్యోతి' మాస పత్రికలో] ★